ప్రజాశక్తి
గురువారం 21 మార్చి 2024
5
కర్నూలు



వామపక్ష అభ్యర్థులను గెలిపించండి

- బిజెపి, టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించండి - సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు అసెంబ్లీ స్థానానికి సిపిఎం పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు కె.జగన్నాథంతో కలిసి ప్రభాకర్ రెడ్డి బుధవారం కర్నూలు సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సిపిఎం, సిపిఐ పరస్పర సహకారంతో ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని అనుకున్నామని, కాంగ్రెస్‌తోనూ చర్చలు నడుస్తున్నాయని, త్వరలోనే అవి కూడా కొలిక్కి వస్తాయని తెలిపారు. సిపిఎం పోటీ చేసే స్థానాల్లో సిపిఐ బలపరుస్తుందని, సిపిఐ పోటీ చేసే స్థానాల్లో సిపిఎం బలపరుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా టిడిపి, జనసేన, పరోక్షంగా వైసిపి బిజెపిని మోసే పనిలో ఉన్నాయన్నారు. పదేళ్ల బిజెపి పాలన దేశాన్ని వెనక్కి తీసుకెళ్లిందని, ఎక్కడా ఉద్యోగావకాశాలు కల్పించలేదని, ధరల భారంతో సామాన్యులు నలిగిపోతున్నారని అన్నారు. బ్రిటీషర్లు ముందుకు తెచ్చిన విభజించు, పాలించు సిద్ధాంతాన్ని బిజెపి అమలు చేస్తోందన్నారు. మతాన్ని, రాజకీయాలను మిళితం చేస్తున్నారని, ఇది రాజ్యాంగానికి భిన్నమైనదని తెలిపారు. పదేళ్ల బిజెపి పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగిందని, మతాన్ని రాజకీయ స్వార్థానికి వినియోగిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని అన్నారు. బిజెపిని ఓడించాలని వామపక్షాలుగా ప్రయత్నం చేస్తున్నామని, కలిసొచ్చే వాళ్లందరినీ కలుపుకుని వెళుతున్నామని తెలిపారు. రాష్ట్రంలోనూ బిజెపిని, బిజెపి మిత్రులను ఓడించాలనేది తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రత్యక్షంగా పాలించినా పరోక్షంగా బిజెపి పాలనే సాగిందన్నారు. నిరంకుశంగా పాలన సాగిస్తున్న వైసిపిని, మతోన్మాద బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేనను ఓడించాలని, ప్రజా ఉద్యమాలకు మద్దతు తెలపాలని, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథం

సిఎఎ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సిఎఎ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. దేశాన్ని మతం ప్రాతిపదికన చీల్చే కుట్రే సిఎఎ అని తెలిపారు. సిఎఎ పట్ల టిడిపి, వైసిపి అవకాశవాదంతో ఉన్నాయన్నారు. వారికి సూత్రబద్ధమైన విధానం లేదని విమర్శించారు.

మోడీ పెద్ద నియంత, జగన్ చిన్న నియంత

- సిపిఐ రాష్ట్ర నాయకులు కె.జగన్నాథం

మోడీ పెద్ద నియంత అని, జగన చిన్న నియంత అని సిపిఐ రాష్ట్ర నాయకులు కె.జగన్నాథం తెలిపారు. రాష్ట్రంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, కలిసొచ్చే పార్టీలు కూటమిగా ఏర్పడి బిజెపిని, టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని నిర్ణయించామన్నారు. మోడీ నిరంకుశ చట్టాలను తీసుకొచ్చారని, పరుగెత్తి ప్రయివేటీకరణ చేశారని, నియంతలా పాలన సాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో మోడీ అధికారంలో ఉండటానికి వీల్లేదని తెలిపారు. ఎన్నికల్లో బిజెపిని, దాని మిత్రపక్షాలైన టిడిపి, జనసేనను, పరోక్షంగా సహకరిస్తున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఐగా కర్నూలు పార్లమెంట్, ఆలూరు, ఆదోని, డోన్ అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీకి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రజా ఉద్యమాల కోసం పోరాటం చేసే వామపక్షాలను, కలిసే శక్తులను గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకృష్ణ, పిఎస్.రాధాకృష్ణ, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నగర కార్యదర్శివర్గ సభ్యులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింగిల్ విండో ద్వారా అన్ని అనుమతులు

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల ప్రచార అనుమతులకు కోసం సింగిల్ విండో ద్వారా 'ఫస్ట్ ఇన్ - ఫస్ట్ ఔట్' ద్వారా అనుమతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతి ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఎంసిసి అమలులోకి వచ్చిందని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలిపారు. ఎంసిసి అమలును జిల్లా పరిషత్ సిఇఒ హౌసింగ్ పిడి పర్యవేక్షిస్తున్నారని, ఇందుకు సంబంధించి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఒక కమాండ్, కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. దీని ద్వారా ఎంసిసి కోడ్ అమలును పర్యవేక్షించడం జరుగుతోందన్నారు. ఎన్నికల షెడ్యూల్ రాగానే ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల మీద ఉన్న ప్రకటనలను తొలగించడంతో పాటు పోస్టర్లు, బ్యానర్లు, గోడ వ్రాతలకు సంబంధించిన వాటిని 24 గంటలలోనే తొలగించారన్నారు. అటువంటివి ఇంకా ఎక్కడైనా ఉంటే టోల్ ఫ్రీ నెంబర్, కాల్ సెంటర్, ల్యాండ్ లైన్ నంబర్, వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకొనిరావాలన్నారు. 72 గంటలకు సంబంధించి అన్ని పబ్లిక్ సివిల్ వర్క్స్ చేసే శాఖలకు సంబంధించిన పనుల వివరాలను అప్లోడ్ చేశామని వివరించారు. ప్రస్తుతం ఉన్న హోర్డింగులను తప్ప కొత్తవి ఏర్పాటు చెయ్యకూడదన్నారు. ప్రైవేటు భవనాలపై ఎటువంటి గోడ రాతలు ఉండకుండా చూడాలన్నారు. కేవలం పోస్టరు ఏర్పాటుకు మాత్రమే అనుమతి ఉందని దానికి కూడా ఇంటి ఓనరు సమ్మతితో పాటు ఎన్నికల ఖర్చులో లెక్క పెట్టేందుకు ఎన్ని పోస్టర్లు, ఎన్ని ఇళ్ల మీద, ఎంత సెంటీమీటర్ల పొడువుతో ఏర్పాటు చేస్తున్నారని ఒక నివేదిక రూపంలో అందజేస్తూ రిటర్నింగ్ అధికారి నుండి అనుమతి తీసుకోవాలన్న విషయాన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు వారి కిందిస్థాయి వారికి తెలియజేయాలని రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. రాజకీయ పార్టీలు అనుమతులకు సంబంధించి సువిధ పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా నామినేషన్లు, ప్రచారాలు, పోస్టర్లు, పాంప్లెట్, వాహనాల అనుమతి తదితర వాటికి సంబంధించి సదరు పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని అన్ని వివరాలు నమోదు చేసి అనుమతులు పొందాలన్నారు. ఇప్పటి వరకు ఇంకా అభ్యర్థి ఖరారు కాలేదని, సంబంధిత రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు పేరు మీద అనుమతులకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం సువిధ వెబ్‌సైట్ ద్వారా ఏ విధంగా నమోదు చేసుకోవాలన్నారు. డిఆర్ఒ మధుసూదన్ రావు, వైసిపి ప్రతినిధి కృష్ణారెడ్డి, టిడిపి జనరల్ సెక్రెటరీ ఎల్‌వి.ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ, బిజెపి స్టేట్ ఎలక్షన్ సెల్ ప్రతినిధి సాయిప్రదీప్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లు పటిష్టంగా ఏర్పాటు

సాధారణ ఎన్నికలకు సంబంధించిన రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తున్న దష్ట్యా జిల్లా ఎస్పీతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వర్సిటీలో ఇంజనీరింగ్ బ్లాక్, లైఫ్ సైన్స్ బ్లాక్, లైబ్రరీలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీలో 8 నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ బ్లాక్‌లో పాణ్యం, కోడుమూరు, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాలు, లైఫ్ సైన్స్ బ్లాక్‌లో కర్నూలు, ఆదోని నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములు కౌంటింగ్ హాల్‌లు, లైబ్రరీ బ్లాక్‌లో మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో స్ట్రాంగ్ రూములకు సంబంధించి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ హాలుకు సంబంధించి ఇంకా కొన్ని రూములలో వేస్ట్ మెటీరియల్ ఉందని వాటిని తక్షణమే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెసి నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, టిడ్కో ఎస్ఇ రాజశేఖర్, ఆర్ అండ్ బి ఎస్ఇ నాగరాజు, ఇరిగేషన్ ఎస్ఇ రెడ్డి శేఖర్ రెడ్డి, డిటిసి శ్రీధర్, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, టౌన్ డిఎస్‌పి విజయశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



లైబ్రరీలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తండ్రి ఓ పార్టీలో.. కొడుకు మరో పార్టీలో

- ఆస్తులు కాపాడుకోవడానికే తండ్రీకొడుకుల తపన !

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తండ్రి ఓ పార్టీలో ఉండగా కొడుకు మరో పార్టీలో ఉన్నారు. కర్నూలు నగరానికి చెందిన వ్యాపారవేత్త టిజి.వెంకటేష్ బిజెపిలో ఉండగా ఆయన కుమారుడు టిజి.భరత్ టిడిపిలో ఉన్నారు. టిజి.వెంకటేష్ ముందు నుంచీ పార్టీలు మారుతూనే వస్తున్నారు. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా కర్నూలు శాసనసభ నియోజకవర్గంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు చెందిన వి.రంభూపాల్ చౌదరి మీద పోటీ చేసి గెలుపొందారు. 2004 ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో అదే పార్టీ తరపున అదే నియోజకవర్గంలో పోటీ చేసి సిపిఎం అభ్యర్థి ఎం.ఎ.గఫూర్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ సంవత్సరం తరువాత భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరాడు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా 2009 ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే ఆంధ్రప్రదేశ్ యొక్క విభజనపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వెంకటేష్ 2014లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 2014లో మళ్ళీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కర్నూలు అసెంబ్లీకి పోటీ చేశారు. వైసిపికి చెందిన ఎస్వీ మోహన్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. జూన్ 2016 నుండి ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభలో టిడిపి సభ్యుడిగా ఉన్నాడు. 2019లో బిజెపిలోకి చేరారు. ఇప్పుడు మాజీ రాజ్యసభ సభ్యునిగా ఉంటూ బిజెపి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆయన కుమారుడు టిజి.భరత్ మాత్రం తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. టిజి భరత్ 2019 ఎన్నికల్లో కర్నూలు అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థిగా పోటీ చేశారు. వైసిపి అభ్యర్థి ఎం.ఎ.హఫీజ్ ఖాన్ చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి కర్నూలు నియోజకవర్గ టిడిపి సమన్వయకర్తగా ఉన్నారు. ప్రస్తుతం టిడిపి అభ్యర్థిగా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భరత్ పోటీ చేస్తున్నారు. తండ్రి బిజెపిలో ఉండగా కొడుకు టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. వారి ఆస్తులను కాపాడుకోవడానికి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో టిజి.వెంకటేష్ చేరుతారని బహిరంగంగా ప్రజల్లో చర్చ ముందు నుంచీ నడుస్తోంది. ఇప్పుడు తనకు అధికారం లేకపోవడంతో కుమారుడిని టిడిపి నుంచి బరిలోకి దింపారని ప్రజల్లో వాదన వినిపిస్తోంది.



జిజి హెచ్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఒప్పందం

- మూడు అనస్తీసియా వర్క్ స్టేషన్ పరికరాల డొనేషన్

- సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగా రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మూడు అనస్తీసియా వర్క్ స్టేషన్ పరికరాలను డొనేషన్ చేయడానికి ముందుకు వచ్చిందని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి తెలిపారు. బుధవారం రూ 18.75 లక్షల విలువగల మూడు అనస్తీసియా వర్క్ స్టేషన్ పరికరాల డొనేషన్ చేయడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించడానికి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వారితో మాట్లాడిన అనంతరం వారు డొనేషన్ ఇవ్వడానికి వచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రిలో పవర్ గ్రిడ్ నార్మ్స్ ప్రకారం టెండర్స్ వెళ్లినట్లు తెలిపారు. అనంతరం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఆసుపత్రి నుండి ఎంఒయు పరికరాల సరఫరాకు అవగాహ న ఒప్పందంపై సంతకాలు చేశారు. అనంతరం పవర్ గ్రిడ్ సౌజన్యంతో మూడు వర్క్ స్టేషన్లు డొనేట్ చేసే అవకాశం ఉంది అని ఆయన తెలిపారు. ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, అనస్తీసియా హెచ్ఒడి డాక్టర్ కొండారెడ్డి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ చౌవన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంటున్న సూపరింటెండెంట్



విలేకరుల సమాసమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

29న 'మేము సిద్ధం' బస్సుయాత్ర

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఈనెల 29న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మేం సిద్ధం బస్సుయాత్ర కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరులో నిర్వహించనున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కర్నూలు నగరంలోని త్రిగుణ క్లార్క్ ఇన్ హోటల్లో కర్నూలు జిల్లా పార్లమెంటు నియోజకవర్గం, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసిపి రీజినల్ కోఆర్డినేటర్ పొన్నం రామసుబ్బారెడ్డి హాజరయ్యారు. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈనెల 27న 'మేం సిద్ధం' బస్సు యాత్ర కడప జిల్లా లోని ఇడుపులపాయలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రారంభిస్తారన్నారు. ప్రొద్దుటూరులో యాత్రను ముగించుకొని 28న నంద్యాల జిల్లాలోకి ప్రవేశిస్తుందని, అక్కడ ప్రత్యేకంగా ఒక గ్రామాన్ని ఎంచుకుని స్థానిక ప్రజలతో ముఖాముఖి చర్చిస్తారన్నారు. 29న కర్నూలు జిల్లాలోకి ప్రవేశించి ఎమ్మిగనూరులో సభను నిర్వహించనున్నారు. ఈ బస్సు యాత్ర రాయలసీమ జిల్లాలోని ఇతర జిల్లాల్లో పయనిస్తుందన్నారు. సమావేశంలో కర్నూలు జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్త బివై.రామయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, హఫీజ్ ఖాన్, సాయి ప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి, శ్రీదేవి, ఎమ్మెల్సీ ఇసాక్, నంద్యాల జిల్లా ఎమ్మెల్యేలు శిల్ప చక్రపాణి రెడ్డి, బిజేంద్రరెడ్డి, కర్నూలు జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు ఇంతియాజ్, డాక్టర్ ఆదిమూలపు సతీష్, బుట్టా రేణుక, అబ్జర్వర్ సురేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

పేద ముస్లిములకు నిత్యవసరాలు పంపిణీ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్



కర్నూలు బిర్లా కాంపౌండ్‌లో ఎంఎస్‌బిల్డర్ కార్యాలయంలో ఉపవాసం ఉన్న నిరుపేద మహిళలకు బుధవారం నిత్యవసర సరుకులను మీసాల సుమలత పంపిణీ చేశారు. ఎంఎస్ బిల్డర్ అధినేతకొట్టముల్ల మహబూ బ్‌బాష మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉన్న వారికి అందే ప్రతిఫలం, నిత్యవసర సరుకులు, ఇఫ్తార్ విందులు ఇచ్చిన వారికి ఉపవాస ప్రతిఫలం ఉంటుందని తెలిపారు. షేక్ అలీమ్ బాష, భాస్కర్ రెడ్డి ,సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులను పరిష్కరించండి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్‌జిఎస్‌పి 1950, జిల్లాలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ లకు, సి విజిల్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలకు ప్రభుత్వ ప్రదేశాలలో హోర్డింగ్‌లు ఉన్నప్పటికీ అందులో ఎటువంటి రాజకీయ అడ్వర్‌టైస్‌మెంట్లు అనుమతించకూడదని, అందులో కేవలం స్వీప్ యాక్టివిటీస్, ఎన్నికలకు సంబంధించిన అత్యవసర మెసేజ్‌లు తప్ప రాజకీయ అడ్వర్‌టైజ్‌మెంట్లను అనుమతించకూడదని కలెక్టర్ తెలిపారు. కేవలం హైవే, మెయిన్ రోడ్డుల మీద ఉండే పెద్ద పెద్ద హోర్డింగులు ఉన్న వాటిలో మాత్రమే పొలిటికల్ అడ్వర్‌టైస్‌మెంట్లు చేయాలని, అందులో కూడా ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదా వ్యక్తికి పూర్తిగా కేటాయించడం జరగకూడదని, అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అదే విధంగా ఇప్పటికే ఉన్న హోర్డింగులు తప్ప కొత్తవి ఏర్పాటు చేయకూడదన్నారు. ప్రైవేటు భవనాలపై వాల్ పెయింట్స్‌తో రాతలకు అనుమతిలేదని, తాత్కాలికంగా తొలగించదగిన జెండాలు, పోస్టర్లను పెట్టుకోవచ్చునన్నారు. ప్రైవేట్ ఇళ్లు, ప్రైవేట్ కాంప్లెక్స్‌ల మీద కూడా ముందు నుండి పెద్ద పెద్ద హోర్డింగులు ఉన్న వాటికి అనుమతులు ఇవ్వడం జరుగుతుందని, అలా అని కొత్తగా ఇళ్లు తీసుకొని హోర్డింగ్ లాంటివి పెట్టడం చేయకూడదన్నారు. జిల్లాలో స్వీప్ యాక్టివిటీస్ ముమ్మరంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమావేశాలు, ర్యాలీలు ఎప్పుడు ఎక్కడ నిర్వహించాలనే షెడ్యూల్ రూపొందించుకోవాలని, సంబంధిత సమావేశాలలో, ర్యాలీల్లో తాను కూడా పాల్గొంటానని కలెక్టర్ పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.

డబరా ఏరియాలో చెత్తమయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలోని11వ వార్డు డబరలో మున్సిపల్ అధికారులు చెత్తను తీసివేయకపోవడంతో చెత్త మయమైందని వార్డు బాధ్యులు అబ్దుల్ దేశాయ్ అన్నారు. బుధవారం వార్డు పర్యటనలో భాగంగా డబర ప్రాంతాన్ని పరిశీలించారు. చెత్త పేరుకుని దుర్గంధం వెదజల్లుతుందన్నారు. అక్కడ ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, ఉదయం వచ్చి చెత్త తీసుకుపోవడం లేదన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురై డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ రోగాలకు గురయి ఆసుపత్రులకు చేరి ఇబ్బంది పడుతున్నారన్నారు. అక్కడ చెత్త లేకుండా చేసే బాధ్యత కమిషనర్ శానిటర్ ఇన్‌స్పెక్టర్లు బాధ్యత అని చెప్పారు. చెత్త తొలగించని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ పర్యటనలో మూర్తి, దేవస్వామి ,మోష, తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ...

ప్రజాశక్తి-పత్తికొండ



రోజురోజుకు సూర్యుడి భగభగలు పెరుగుతున్నాయి. వేడి తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలను ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులు 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్నాయి. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. ఇళ్లల్లో ఉన్న ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజలు రైతులు వ్యవసాయ కూలీలు తమ పనులను ఉదయం 10 గంటల లోపు ముగించుకొని ఇంటికి వెళ్ళాలి. సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాతే బయటికి రావాలి.. గర్భిణీలు బాలింతలు చిన్న పిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎండలో ఎవరైనా బయటికి వెళ్లేటప్పుడు తేలికపాటి దుస్తులు ధరించి గొడుగు తీసుకెళ్లాలని ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎవరికైనా వడదెబ్బ తగిలిన వెంటనే ప్రథమ చికిత్స అందించి అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి..

నిమ్మకాల వ్యాపారి నెట్టికంటయ్య పత్తికొండ



ఎండ తీవ్రత వల్ల దాహం దాహం అంటూ హోటల్లో చుట్టూ తిరుగుతూ ఉన్నాం. ప్రభుత్వ అధికారులు బహిరంగ ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.



మూడు నెలలు జాగ్రత్తగా ఉండాలి...

ప్రభుత్వ డాక్టర్ కల్పన

మార్చి ,ఏప్రిల్ ,మే నెలలో ఎండలు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. చిన్నపిల్లలు, వద్దులు గర్భవతులు బాలింతలు చాలా జాగ్రత్తగా తీసుకోవాలి. తేలకపాటి దుస్తులను ధరించాలి. రోజుకు కనీసం ఎనిమిది లీటర్ల నీటిని తీసుకోవాలి.



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జగన్నాథం

భగత్ సింగ్ వర్ధంతి సభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 23న నిర్వహించే భగత్ సింగ్ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని రైతు. కార్మిక ,విద్యార్థి, యువజన సంఘాలు నాయకులు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్ధంతి సభల జయప్రదానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకష్ణ అధ్యక్షతన సుందరయ్య భవన్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె .ప్రభాకర్ రెడ్డి. రైతు సంఘం రాష్ట్ర నాయకులు జగన్నాథం, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి అంజిబాబు, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్ రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు డివైఎఫ్ఐ కార్యదర్శి నాగేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర కోసం అశువులు బాసిన భగత్ సింగ్ వర్ధంతి సభలను వాడవాడలా జరిపి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. రైతుల పట్ల భగత్ సింగ్ ఎంతో ప్రేమతో ఉండేవాడని ,ఈరోజు కేంద్ర ప్రభుత్వం రైతులు వ్యతిరేక విధానాలు, కార్మిక వ్యతిరేక విధానాలు విద్యార్థి యువజన వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్నారు. రైతులు 375 రోజులు ఆందోళన చేసి ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయకపోవడం వల్ల మళ్లీ ఢిల్లీలో రైతులు ఆందోళన కొనసాగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను భగత్ సింగ్ వర్ధంతి సభల సందర్భంగా తెలియజేయాలని వీధులలోనూ సర్కిలలోనూ అలాగే కార్మిక సంఘాల కేంద్రాలలోనూ జిల్లాలో అన్ని మండల కేంద్రాలలోనూ భగత్ సింగ్ వర్ధంతి సభలు జయప్రదం చేయడానికి అన్ని ప్రజాసంఘాలు కలిసి రావాలని కోరారు.

కాంగ్రెస్ లోకి మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కోడుమూరు



కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళికృష్ణ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో ఆయన బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

టిడిపి టికెట్ తిక్కారెడ్డికే ఇవ్వాలి

- టిడిపి శ్రేణుల అభిప్రాయ సేకరణతో తీర్మానం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం నియోజకవర్గం నుంచి టిడిపి టికెట్‌ను తిక్కారెడ్డికే ఇవ్వాలని వివిధ గ్రామాల టిడిపి శ్రేణులు అభిప్రాయ సేకరణతో తీర్మానం చేశాయి. బుధవారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోసిగి పెద్దకడబూరు మండలాల్లోని సాతనూరు కందుకూరు, కంబాదిన్నె, జాలవాడి, మురవణి గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ అభ్యర్థి పాలకుర్తి తిక్కారెడ్డి అని, ఆయనకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. పార్టీ అధిష్టానం కూడా ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో పునరాలోచన చేయాలని కోరారు. ఈ విషయంపై మూకుమ్మడిగా తీర్మానాన్ని ఆమోదించి తిక్కారెడ్డికి తెలిపారు. ఈ సందర్భంగా పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడారు. మీ ఆదరణ, అభిమానంతో కచ్చితంగా అధిష్టానం తనకు అవకాశం ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సలకలకొండలో చిరుత పులి మృతి

ప్రజాశక్తి - ఆదోని



మృతి చెందిన చిరుత పులి

ఆదోని మండలం సలకలకొండ గ్రామానికి ఎడమవైపు గల ఊరుకొండ పక్కన ఉన్న పుల్లమ్మ గారి గోవిందు రెడ్డి పొలంలో బుధవారం చిరుత పులి మృతి చెందినట్లు అటుగా వెళ్తున్న వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని సంబంధిత పోలీసు అధికారులకు, ఫారెస్ట్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని మాజీ సర్పంచి మల్లికార్జున తెలిపారు. మృతి చెందిన చిరుతపులిని చూసేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నియోజకవర్గ పరిధిలో చిరుత పులి మరణించడం ఇది రెండోసారి. నియోజకవర్గ పరిధిలో ఇంకా చిరుతపులులు ఉన్నాయని, ఫారెస్టు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిరుతపులులు జనావాసాల్లోకి రాకముందే పసిగట్టి బోన్లు ఏర్పాటు చేసి పట్టుకుని దట్టమైన అడవుల్లో వదిలిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కౌతాళంలో వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలోని 14వ వార్డులో వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి, శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం, శ్రీబుడుముల దొడ్డి అంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద ఆచారి, సచివాలయ కన్వీనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని పేర్కొన్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగి రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధిని చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేసినట్లు తెలిపారు. సర్పంచి పాల్ దినకరన్, దాట్ల సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, చౌదరి బసవ రాజ్, ఉప సర్పంచి సక్కరి తిక్కయ్య, వడ్డే రామన్న, ఉమాపతి, మాజీ సర్పంచి అవతారం, నాయకులు అబ్దుల్ సమ్మద్, రాజ్ హమ్మద్, ఈడిగ శివ, భీమేష్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నోటిఫికేషన్ ఇవ్వకుండానే నియామకాలు..?

- రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను గాలికి వదిలేసిన అధికారులు

ప్రజాశక్తి-ఆలూరు

ఎలాంటి అవినీతికి తావూ లేకుండా ప్రభుత్వ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు చేపడతామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఆ మాటలు ఉత్తి గాలి మాటలే అని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గతంలో ఆలూరు సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ శాఖలో ఆయా పోస్టులకు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే రాజకీయ నాయకుల అండదండలతో భర్తీ చేశారు. ప్రస్తుతం హోళగుంద మండలం కోగిలతోట సబ్ స్టేషన్‌లో కూడా ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే పోస్టులను భర్తీ చేస్తారా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పోస్టులు నోటిఫికేషన్ పడ్డాయంటే ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు పండగే. ఆలూరు సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖలో 2019 సంవత్సరం నుంచి ఇప్పటివరకు కమ్మరచేడు, నగరడోన, చిప్పగిరి, హాలహర్వి, నెరణికి, చింతకుంట సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు రాజకీయ నాయకుల అండదండలతో అధికారులు, ఏజన్సీ వారు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా రూ.లక్షలు దండుకొని నియామక పత్రాలు అందజేస్తునట్లు తెలిసింది. ప్రభుత్వం ప్రభుత్వ శాఖలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పోస్టులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఆయా కులాలకు కేటాయిస్తూ ఏజెన్సీ వారు పత్రిక ప్రకటన విడుదల చేస్తారు. నిరుద్యోగుల ద్వారా దరఖాస్తులు స్వీకరించిన తర్వాత సెలెక్ట్ కమిటీ సభ్యులు ఎస్ఇ, ఇఇ ఆధ్వర్యంలో మెరిట్, పోల్ టెస్టులలో నెగ్గిన వారికి నియామక పత్రాలు అందజేస్తారు. అలాంటివి ఏవీ జరగకుండా నోటిఫికేషన్ ఇవ్వకుండా, విద్యార్హత లేకపోయినా రాజకీయ నాయకులు చెప్పిన వారినే నియమిస్తూ అర్హులైన నిరుద్యోగులను నట్టేట ముంచుతున్నారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఫిబ్రవరిలో ప్రారంభించిన హోళగుంద మండలం కోగిలతోట సబ్ స్టేషన్‌లో నాలుగు షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ నోటిఫికేషన్ పత్రిక ప్రకటన ద్వారా ప్రకటించి నియామకాలు జరుపుతారా లేదా వేచి చూడాల్సి ఉంది.



ఆలూరు డిఇఇ కార్యాలయం

ఎలాంటి నోటిఫికేషన్ వదల్లేదు

- నాగేంద్ర ప్రసాద్, డిఇఇ, ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్

కోగిలతోట సబ్ స్టేషన్‌కు ఇప్పటి వరకు ఎలాంటి నోటిఫికేషన్ వదల్లేదు. నోటిఫికేషన్ ద్వారా ఏజెన్సీకి వచ్చిన దరఖాస్తులను ఎస్ఇ, ఇఇ పరిశీలించి నియమించిన వారినే తాము విధుల్లోకి తీసుకుంటాం.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

అనారోగ్యంతో మృతి చెందిన మాల ఉసేనప్ప కుటుంబానికి మాధవరం మాజీ సర్పంచి, టిడిపి నాయకులు ఎన్.రఘునాథ్ రెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన మాల ఉసేనప్ప అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు ఎన్.రఘునాథ్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఉసేనప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. సత్యన్న, చిదానంద, శివ, ఉస్సేని, తిమ్మప్ప, రాజన్న, హనుమంతు, ఈరన్న, వీరేష్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

నేటి నుంచి మూగితాత ఉరుసు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ గ్రామంలోని మూగితాత దర్గా 39వ ఉరుసు ఉత్సవాలు గురువారం ప్రారంభమవుతున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా దర్గాను రంగులతో విద్యుద్దీపాలతో అలంకరించారు. గురువారం గంధం, శుక్రవారం ఉరుసు, శనివారం జియారత్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలను తిలకించడానికి కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రం బళ్లారి, తెలంగాణ నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని హెబ్బటం గ్రామ సమీపంలో కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. నెరణికి గ్రామానికి చెందిన టాక్రియా నాయక్, దుర్గా నాయక్, పరమేష్ నాయకులు 8 బాక్సుల కర్ణాటక మద్యాన్ని రెండు మోటార్ సైకిళ్లపై రారావి నుంచి నెరణికి తాండాకు తరలిస్తున్నట్లు తెలిపారు. హోళగుంద ఎస్ఐ జి.పెద్దయ్య నాయుడు తన సిబ్బందితో కలిసి హెబ్బటం గ్రామం ఊరు బయట కురుకుంద రోడ్డులో అరెస్టు చేసినట్లు చెప్పారు. 768 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



మద్యాన్ని చూపుతున్న పోలీసులు

రాఘవేంద్రరెడ్డి గెలుపునకు కృషి

- కోసిగి మండల వాల్మీకి యూత్ సభ్యులు

ప్రజాశక్తి - కోసిగి

టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం రాఘవేంద్రారెడ్డి గెలుపునకు కృషి చేస్తామని వాల్మీకి యూత్ సభ్యులు తెలిపారు. బుధవారం కోసిగిలో వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాఘవేంద్ర రెడ్డికి ఓటు వేసి గెలిపించుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల వాల్మీకి యూత్ నాయకులు అరవిలి ఈరేష్, హోటల్ ఈరేష్, పెరలి అనుమేష్, పోతుల మధు, పోతుల ఈరెడ్డి, భీమేష్ మాట్లాడారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన దలవాయి రామయ్య విషయంలో పార్టీ గుర్తును చూసి ఓట్లు వేసి ఓడించుకున్నామని తెలిపారు. ఇప్పుడు 2024 ఎన్నికల్లో అలా కాకుండా అందరూ పార్టీ గుర్తు కాకుండా ఐక్యమత్యంతో బీసీలోని అన్ని కులాల వారు, వాల్మీకులు రాఘవేంద్రరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. నియోజకవర్గంలో 80 శాతానికి పైగా బీసీలు, వాల్మీకులే ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ఈ ఎన్నికల్లో రాఘవేంద్రరెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. అనంతరం వాల్మీకి సర్కిల్‌లో రోడ్డుపై నినాదాలు చేస్తూ రాఘవేంద్రరెడ్డికి ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని తెలిపారు. వాల్మీకి యూత్ సభ్యులు మల్లికార్జున, మాంతయ్య, ఉప్పలపాటి అర్జున్, రామిరెడ్డి, తిక్కారెడ్డి, మాదేవా, వెంకటేష్, కోసిగి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వాల్మీకి యూత్ సభ్యులు పాల్గొన్నారు.



రాఘవేంద్ర రెడ్డికి మద్దతుగా నినాదాలు చేస్తున్న వాల్మీకి యూత్ సభ్యులు

'బార్' ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాదులు శ్రీరాములు, మల్లికార్జున, అనీతా బాయి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 22, 23న నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన అదే రోజు ఉపసంహరణ, 27న పోలింగ్, అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తున్నట్లు తెలిపారు. వార్షిక చందా కట్టిన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తామన్నారు. దీనిపై సీనియర్ న్యాయవాదులు జిసి.రంగన్న, ఖాసీం అభ్యంతరాలు తెలిపారు. బార్ రూం నిర్వహణ ఎలా చేయాలో కూడా సలహాలు ఇవ్వాలని ఈసీ మెంబర్లు కోరారు. సీనియర్ న్యాయవాదులు విశ్వనాథ్ రెడ్డి, విరుపాక్షి రెడ్డి, శ్రీధర్ రెడ్డి, జీవన్ సింగ్, అబ్దుల్ రషీద్, తబ్రేజ్, ఇతర జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఆదోని

రైలులో ప్రయాణిస్తున్న ఒక గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి తీవ్రగాయాలతో మృతి చెందినట్లు రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐ గోపాల్ బుధవారం తెలిపారు. ఈనెల 19న రాత్రి 11 గంటలకు ముందు ఆస్పరి, మొలగవల్లి రైల్వే స్టేషన్ మధ్య కెఎం నెంబర్ 470/ 28 వద్ద ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి (30-35) గుర్తు తెలియని రైలు నుంచి జారి కింద పడ్డారని, తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు వివరించారు. మృతుని శరీరం అంతా కుళ్లి పోయి పూర్తిగా గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉందని తెలిపారు. మృతుడు సుమారు మూడు రోజుల క్రితం రైలు నుండి పడిపోయి ఉండవచ్చని చెప్పారు. ఆచూకీ కోసం వివరాలు తెలియజేస్తూ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

'పది' పరీక్షలకు 24 మంది గైర్హాజరు

ప్రజాశక్తి- దేవనకొండ

పదో తరగతి పరీక్షలకు 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ తిమ్మారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. మండలంలోని దేవనకొండ జిల్లా పరిషత్ హై స్కూల్, కస్తూరిబా గాంధీ పాఠశాల, తెర్నేకల్ జిల్లా పరిషత్ హై స్కూల్ ఎ, బి సెంటర్లలో మొత్తం 843 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. అందులో 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించినట్లు, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ రామకృష్ణ యాదవ్ గుడిసె గుప్పరాళ్లలో పలు అనుమానాస్పద, బెల్ట్ షాపులు నిర్వహించే ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఎక్కడైనా అక్రమ మద్యం కానీ, నిబంధనలకు విరుద్ధంగా నగదు రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఆర్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, గ్రామ సేవకులు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్

ప్రశాంత ఎన్నికలకు

పోలీసు కవాతు

ప్రజాశక్తి - హోళగుంద

రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు, ఓటర్లు ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకునేందుకు పోలీసు కవాతు నిర్వహించినట్లు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పెద్దయ్య నాయుడు తెలిపారు. రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా కేంద్ర బలగాలు బుధవారం హోళగుంద, కోగిలతోట, ఎల్లార్తి గ్రామాల్లో కవాతు నిర్వహించారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎర్రబాడులో పెద్దమ్మ దేవర

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

మండలంలోని ఎర్రబాడు గ్రామంలో పెద్దమ్మ, కర్రెమ్మ, మారెమ్మ దేవతల దేవర మహోత్సవాన్ని గ్రామ పెద్దలు బోయ సోమన్న, బి.జయరాముడు, బి.రామకృష్ణ, బి.రాముడు, నాగశేషులు, రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బాన కుండలతో దేవతలకు నైవేద్యం సమర్పిస్తారని వారు పేర్కొన్నారు. గ్రామస్తులు, భక్తులు కార్యక్రమాలకు పెద్ద ఎత్తున హాజరై పూజలో పాల్గొన్నారు. నారాయణ రెడ్డి, నరసింహారెడ్డి, రఘు రెడ్డి, నాయుడు పాల్గొన్నారు.



బాన కుండలతో వెళ్తున్న ప్రజలు

మారుతి ఇస్పాత్ ఫ్యాక్టరీలో

ఇనుప ముద్ద పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో ఉన్న మారుతి ఇస్పాత్ ఫ్యాక్టరీలో ఇనుప ముద్ద పడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి వివరాల మేరకు... ఛత్తీస్‌గడ్‌కు చెందిన యువకుడు గంగా (22) ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్న సందర్భంలో ఇనుప ఖనిజం ముద్ద పడి మృతి చెందినట్లు తెలిపారు. గత మూడు రోజుల క్రితం ఫ్యాక్టరీలో పని చేసేందుకు 13 మంది కూలీలను కాంట్రాక్టర్ తీసుకొచ్చారని చెప్పారు. ఫ్యాక్టరీలో వేస్టేజీని తొలగించే క్రమంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. భద్రత వైఫల్యం, సేఫ్టీ డ్రస్, పరికరాలు, క్యాప్స యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా యువకుడు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు తెలిసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



మృతి చెందిన యువకుడు

కూలీలకు 'ఉపాధి' కల్పించాలి

- ఎంపిడిఒ విజయ లక్ష్మి

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తీసుకోవాలని ఎంపిడిఒ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడారు. ఏప్రిల్‌లో జరిగే ఉపాధి హామీ పనులకు సంబంధించి అన్ని రికార్డులు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఈనెల చివరి వరకు వంద రోజులు పని దినాలు ప్రతి జాబ్ కార్డు ఉన్న కూలీకి కల్పించే విధంగా చూడాలన్నారు. అలాగే పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు ముందుకు వచ్చే రైతులను గుర్తించి తగు నివేదికలను సిద్ధం చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున త్వరగా ఉదయం పూట కూలీలు పనికి వెళ్లే విధంగా చూడాలని తెలిపారు. ఎపిఒ రామకృష్ణ, జూనియర్ ఇంజినీర్ ప్రదీప్, టెక్నికల్ అసిస్టెంట్లు ఎంకప్ప, రాజశేఖర్, రామకృష్ణ, రామాంజనేయులు, పరిదప్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఘనంగా శివలింగం విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - తుగ్గలి



మండలంలోని మామిళ్లకుంట గ్రామంలో బుధవారం శివలింగం, నంది, గణపతి స్వాముల విగ్రహ ప్రతిష్టాపనను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఉండే పురాతనమైన శివాలయాన్ని ఆధునీకరించి విగ్రహ ప్రతిష్టాపనను గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద చిన్న వెంకటరాముడు, వైసిపి నాయకులు హనుమంతు రెడ్డి, సత్తప్ప, టిడిపి నాయకులు డీలర్ తిమ్మప్ప విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలకు కొత్త బట్టలు, ఒడిబియ్యం పెట్టి ఆలయంలో పూజలు చేయించారు. గ్రామంలో విగ్రహ ప్రతిష్టాపనకు బంధుమిత్రులు రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

భవిష్యత్తు ఇచ్చే నాయకుని ఎన్నుకోవాలి

- టిడిపి అభ్యర్థి టిజి.భరత్
- సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఫిస్టా 2కె24 కార్యక్రమంలో పాల్గొన్న టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మొదటిసారి ఓటు వేసే వారందరూ మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని టిడిపి కర్నూలు నియోజకవర్గ అభ్యర్థి టిజి.భరత్ తెలిపారు. బుధవారం నగరంలోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ కళాశాలలో వారం రోజుల పాటు జరుగుతున్న ఫిస్టా 2కె24 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకొని జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం చాలా కష్టమైందన్నారు. ప్రతి విద్యార్థి కేవలం చదువులోనే కాకుండా అన్ని రంగాలపై పట్టు సాధించాలని సూచించారు. ఈ ఐదు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అందరూ గుర్తించాలన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారన్నారు. యువత భవిష్యత్తుకు మంచి మార్గం చూపేందుకు కర్నూల్లో తాను బాధ్యతగా పని చేస్తానని హామీ ఇచ్చారు. తమ టిజివి సంస్థల తరుపున దశాబ్దాలుగా ప్రజాసేవ చేస్తున్నట్లు చెప్పారు. అధికారంలో ఉంటే ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పారిశ్రామికవేత్తగా తనకున్న అనుభవంతో ఎన్నో పరిశ్రమలు తీసుకొస్తానని చెప్పారు. సరైన నాయకుడు, సరైన ప్రభుత్వం ఉంటే మంచి పాలన అందుతుందన్నారు.



మాట్లాడుతున్న టిజి.భరత్



హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నియోజకవర్గంలోని చాగలమర్రి గ్రామంలో ఈ నెల18న మార్కెట్ వేలం పాటల సందర్భంగా అలంసాగారి ఇమామ్‌ను కత్తితో పొడిచి హత్య చేసిన కేసులో ముల్లా అలాంసా గారి దస్తగిరి, ముల్లా అలాంసా గారి అబ్దుల్ ఖాదర్‌లను అరెస్టు చేసినట్లు ఆళ్లగడ్డ డిఎస్‌పి షేక్ షర్ఫుద్దీన్ తెలిపారు. పట్టణంలోని సిఐ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాగలమర్రి గ్రామ పంచాయతీకి ఈనెల 18న సచివాలయం వద్ద జరిగిన నాలుగు వేలంపాటల్లో ఐదు మంది పాల్గొన్నారన్నారు. మధ్యాహ్నం ఇంచార్జి కార్యదర్శి వేలం పాటకు కూర్చున్నారన్నారు. ముల్లా అబ్దుల్ ఖాదర్ వేలంపాటకి డబ్బులు కట్టిన వాళ్ల మాత్రమే ఉండాలనగా కార్యదర్శి నాగమణి ఇది ఓపెన్ యాక్షన్ డబ్బులు కట్టిన వాళ్ళు మాత్రమే పాడుతారు, మిగతావారు నిల్చోని ఉంటారనగా ఆలంసా గారి రసూల్ కొంతమంది గలాటా పెట్టుకున్నారన్నారు. ఆ గలాటాలో అలంసా గారి రసూల్‌కు చెందిన కొంతమంది అలంసా గారి దస్తగిరి బనియన్ చించారన్నారు. ఫలితంగా గొడవ జరిగిందన్నారు. మృతుడు అలంసా గారి ఇమామ్ హుస్సేన్ అతని తండ్రి రసూల్‌కు అండగా నిలబడడంతో అక్కడే ఉన్న అబ్దుల్ ఖాదర్ కుమారుడు దస్తగిరి తన దగ్గర ఉన్న పిడి బాకుతో ఇమామ్ గొంతులో పొడవడంతో అక్కడికక్కడే ఇమామ్ పడిపోయాడన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై, అతని సిబ్బంది కేరళ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడన్నారు. దస్తగిరి, అబ్దుల్ ఖాదర్‌లను ఈ నెల 19న చాగలమర్రి గ్రామం మల్లవేముల బస్టాండ్ నందు సిఐ హనుమంత నాయక్ అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు. సమావేశంలో ట్రైనీ డిఎస్పి రఘువీర్, రూరల్ సిఐ హనుమంత నాయక్, ఎస్సై రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నోటిశుభ్రత పాటించాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ నోటి పరిశుభ్రత కోసం రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆర్.వెంకటరమణ పేర్కొన్నారు. నేషనల్ ఓరల్ హెల్త్ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుండి సాయిబాబా నగర్ ఆర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రష్ చేసుకోవడంతో పాటు మౌత్ వాష్ వాడితే మంచిదని, స్మూత్‌గా ఉన్న బ్రష్ మాత్రమే వాడాలన్నారు. క్యాన్సర్‌కి కారణమైన టొబాకో పదార్థాలను వాడకూడదని తెలిపారు. జిల్లా సత్వర చికిత్స కేంద్రం జిల్లా అధికారి డాక్టర్ కాంతారావు మాట్లాడుతూ చిన్నపిల్లలు నోటిని శుభ్రపరచుకోవడంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంతరిస్తున్న పిచ్చుకలను కాపాడుదాం

- విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్

ప్రజాశక్తి - నంద్యాల

అంతరిస్తున్న పిచ్చులకును కాపాడుకుందామని, జీవ వైవిధ్యంలో పిచ్చుకలు కీలక పాత్ర పోషిస్తాయని విశ్రాంత శాస్త్రవేత్త, నంది రైతు సమాఖ్య సలహాదారులు డాక్టర్ కె.రవీంద్రనాథ్ తెలిపారు. నంది రైతు సమాఖ్య, నంద్యాల వారి ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం బుధవారం సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'జీవవైవిధ్యం-పిచ్చుకల సంరక్షణ' అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చుకలు రైతుల నేస్తాలని, ధాన్య కళ్లాల్లో మిగిలిపోయిన గింజలను తీసుకుంటూ, పంటల్లో క్రిమి కీటకాదులను దూరం చేస్తూ రైతులకు సహాయకారిగా ఉంటాయని అన్నారు. రైతు జీవన గమనంలో, జీవవైవిధ్యంలో పిచ్చుకలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు మాట్లాడుతూ పిచ్చుకలు గతంలో పంట చేలల్లో, పల్లె ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసేవని, నేడు వాటి సంతతి తగ్గిపోవడం దురదృష్టకరమన్నారు. విశ్రాంత ప్రొఫెసర్ కైలాసనాథ్ రెడ్డి మాట్లాడుతూ సెల్ తరంగాలు, రేడియేషన్, పర్యావరణ కాలుష్యం కారణంగా పిచ్చుకల మనుగడ కష్టంగా మారిందన్నారు. వ్యవసాయ రంగ నిపుణులు మాధవ స్వామి మాట్లాడుతూ పిచ్చుకలు పుల్లా, పుడక చేర్చి అద్భుతమైన గూళ్ళు నిర్మించుకొని సాంకేతిక పరిజ్ఞానంలో మనిషిని తలదన్నే విధంగా నైపుణ్యాన్ని ప్రదర్శించడం సృష్టిలో అద్భుతమన్నారు. దంత వైద్యులు డాక్టర్ కిషోర్ కుమార్ పిచ్చుకల జీవన విధానం గురించి కవితలు వినిపించారు. కైలాసనాథరెడ్డి, ఓబులపతి మాట్లాడుతూ పిచ్చుకల మనుగడకు ప్రమాదం ఏర్పడితే అది మానవాళికి జీవ వైవిధ్యానికి నష్టం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఫీ, బాలచంద్రుడు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్

ఆవోపా ఆధ్వర్యంలో కూల్ మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఆవోపా ఆధ్వర్యంలో బుధవారం కూల్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పట్టణ ఎస్‌ఐ షేక్ నగీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డలో గత 12 సంవత్సరాలుగా అవోపా ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందిస్తున్న అవోపా సంఘ ప్రతినిధులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో అవోపా జిల్లా వైస్ ప్రెసిడెంట్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏవి రామసుబ్రమణ్యం, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తొమ్మండ్రు వినోద్ కుమార్, మినరల్ వాటర్ ప్లాంట్ దాత గాదంశెట్టి రామచంద్రయ్య, అవోపా అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, నాగ భరత్, పలుకూరు సురేష్ బాబు, ఆరబెట్టి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



23న జిల్లా వ్యాప్తంగా భగత్‌సింగ్ వర్ధంతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సర్దార్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో విరివిగా పాల్గొని స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ నేటి యువతకు వారి చరిత్రను తెలిపే విధంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించాలని ఎఐవైఎఫ్ కార్యకర్తలకి ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి కోరారు. బుధవారం స్థానిక సిఆర్ భవన్ నందు ఎఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న శ్రీనివాసులు, కారుమంచి మాట్లాడుతూ 12 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర ఉద్యమ నాయకుల రక్తంతో తడిచిన జలియన్ వాలాబాగ్ నేలను ముద్దాడి ,14 సంవత్సరాల వయసులోనే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా 1928లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా లాహోర్‌లో జరిగిన ఆందోళనకి బ్రిటిష్ వారు నిర్దాక్షణంగా లాఠీ ఛార్జి చేసి లాలా లజపతిరాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ పోలీస్ అధికారిని చంపడానికి సైతం వెనకాడని స్వాతంత్ర సమరయోధులు సర్దార్ భగత్ సింగ్ అని వారు పేర్కొన్నారు. ఈనెల 23న జిల్లావ్యాప్తంగా సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలను నివేసి నివాళులర్పించడంతోపాటు వివిధ సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. రైతులు 375 రోజులు ఆందోళన చేసి ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయకపోవడం వల్ల మళ్లీఢిల్లీలో రైతులు ఆందోళన కొనసాగిస్తున్నా రన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఎఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేవర్స్ బీసన్న , రాజీవ్, రమేషు , రాజశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సహాయ కమిషనర్ ఎన్. బషిరున్నిసా బేగం

ఎండలో పనులు చేయనివ్వొద్దు

- బిల్డింగ్ నిర్మాణాల వద్ద పని వేళల్లో మార్పులు చేయండి
- కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎన్. బషిరున్నిసా బేగం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎండలు అధికమవుతున్న వేళ వడగాల్పులు వీస్తున్న ప్రస్తుత తరుణంలో పరిశ్రమల యాజమాన్యాలు, కన్స్ట్రక్షన్స్ ఓనర్స్, వివిధ షెడ్ల యజమానులు పని చేసే కార్మికుల పట్ల, సిబ్బంది పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎన్.బషిరున్నిసా బేగం సూచించారు. బుధవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ వడ గాల్పులు వస్తున్న నేపథ్యంలో వాటి నుండి ఉపశమానం పొందేందుకు పనుల వద్ద ఒఆర్‌ఎస్ పాకెట్లు, మజ్జిగ, మంచి నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. పనుల వేళల్లో మార్పులు చేసుకోవాలని యాజమాన్యాలను ఆదేశించారు. ఉదయం 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల తరువాత పనులు చేయించుకోవాలని సూచించారు.

బిజెపి, వైసిపిలను ఓడించాలి : ఏఐవైఎఫ్

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

నిరుద్యోగ యువతను మోసం చేసిన బిజెపి, వైసిపి పార్టీలను ఓడించాలని వక్తలు పేర్కొన్నారు. బుధవారం సుండీపెంటలో జరిగిన ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో యువతకు పిలుపునిచ్చిన ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర, నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు. వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా పేరుతో ఓటు హక్కు యువత బాధ్యత అనే అంశం పైన ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శ్రీశైలం నియోజకవర్గం సున్నిపెంట రెడ్ల కల్యాణ మండపం నందు ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు ఏఐవైఎఫ్ శ్రీశైలం నియోజకవర్గం కార్యదర్శి లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు చూపకుండా జీవితాలతో బిజెపి, వైసిపి ఆటలాడుకున్నారని తెలిపారు. ఈ సదస్సులో ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు మల్లికార్జున, శ్రీశైలం నియోజకవర్గం నాయకులు రాజు, సైదులు, శ్రీను, మహేష్, రాజు, శివ, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

బళ్ళారి చౌరస్తా ఆంజనేయ స్వామి దేవాలయములో సిబ్బంది అక్రమాలు

అరికట్టాలని ఆలయ కమిటీ సభ్యులు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

బళ్ళారి చౌరస్తా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగే అక్రమాలపై సంబధిత దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు దృష్టిసారించి అరికట్టాలని ఆలయ కమిటి సభ్యులు, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుదవారం హనుమాన్ టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటి అధ్యక్షులు, ధర్మకర్త సంపతి ఎల్లారెడ్డి అధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బళ్ళారి చౌరస్తా ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం, అభివృద్ధికి విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేసి ఆలయాన్ని కాపాడుకున్నామని తెలిపారు. ఆలయ ధర్మకర్తలు, స్థలదాతలు, దార్మిక, సామాజిక, ఆధ్యాత్మిక వ్యక్తులతో గత కొన్ని సంవత్సరాలుగా పాలక మండలి నీ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే రెండు దశాబ్దాలుగా ఉన్న దేవాలయ కమిటీకి దేవాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు సరైన సేవలు అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో ఈశ్వరయ్య గంగాధర్ గౌడ్, మాధవరాయుడు, శ్యాంసుందర్ గౌడ్, రాజ గౌడు, భరత సింహారెడ్డి తిమ్మారెడ్డి కష్ణంరాజు రాజేష్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పలుకుదొడ్డిలో ఘనంగా బడేషాఖాద్రి ఉరుసు

ప్రజాశక్తి- సి బెళగల్



మండలంలోని పలుకుదొడ్డిలో బడేషాఖాద్రి ఉరుసు మహోత్సవాలు బుధవారం ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. దర్గా దగ్గరకి ఊరేగింపుగా భక్తులు వెళ్లి స్వామి వార్లను దర్శించుకొన్నారు. ఇక్కడే ఆలయ పిఠాదిపతులు భక్తులను ఆశీర్వాదించారు. దీంతో గ్రామంలో భక్తులతో కిక్కిరిసి పోయింది.

సమసమాజ నిర్మాణమే లక్ష్యం

వైసిపి, టిడిపిలను ఓడించండి

అభివద్ధి చేసేందుకే కర్నూలు నుండి పోటీ

ఎపి రామయ్య యాదవ్, వ్యవస్థాపక అధ్యక్షులు, జాతీయ సమసమాజం పార్టీ

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్



కుల మతాలు లేని సమసమాజ స్థాపనకే జాతీయ సమసమాజం పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎపిరామయ్య యాదవ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం జాతీయ సమసమాజం పార్టీ కర్నూలు నియోజకవర్గం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజహితం కోసం తన పార్టీని గెలిపించి, కుటుంబ పార్టీల పాలనకు చరమగీతం పాడాలని ప్రజలను కోరారు. కర్నూలు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే తాను కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ తనకు అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల సమస్యల పరిష్కారంతోపాటు, కర్నూలు నియోజకవర్గాన్ని అభివద్ధి చేస్తానన్నారు. పరిశ్రమలు కాపాడుకోవడం కోసం రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులను కాకుండా,ప్రజాసేవ కోసం వచ్చిన తనలాంటి వ్యక్తులను ప్రజలు ఎన్నికల్లో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. తన బలంతో ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయాలు నడుపుతున్న వారిని బుద్ధి చెప్పేందుకే తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, ఎపి రామయ్య యాదవ్ కర్నూలు నియోజకవర్గ ప్రజలకు జాతీయ సమసమాజం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు భరోసానిచ్చారు

బిజెపి పొత్తుతో టిడిపిలో అసమ్మతి

- తిరుపతిలో నిరసన గళం
- టికెట్ కేటాయించకపోతే రెబల్‌గా పోటీ చేస్తామని హెచ్చరికలు
- నరసరావుపేట మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్మహత్యాయత్నం


తిరుపతిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుగుణమ్మ

ప్రజాశక్తి - యంత్రాంగం

బిజెపి, జనసేనతో పొత్తులో భాగంగా కొన్ని సీట్లను ఆ పార్టీలకు కేటాయించడంతో టిడిపిలో చిచ్చురేపింది. పలువురు ఆశావహులు రోడ్డెక్కారు. పలుచోట్ల నిరసన గళం వినిపించారు. పార్టీని నమ్ముకున్న నాయకులను, కార్యకర్తలను టిడిపి అధినేత చంద్రబాబు దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపితో పొత్తు పార్టీకే నష్టమని కార్యకర్తలు వాపోతున్నారు. చంద్రబాబు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పొత్తులో భాగంగా తిరుపతి స్థానానికి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు కేటాయించారు. దీంతో ఆరణికి వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఆరణి పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. తనకు టికెట్ కేటాయించకపోతే రెబల్‌గా బరిలో దిగుతానని బుధవారం మీడియా సమావేశంలో సుగుణమ్మ హెచ్చరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కొడుకు బొజ్జల సుధీర్‌రెడ్డికి టికెట్ ప్రకటించడంతో మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పోటీలో ఉన్నానని, చంద్రబాబు మరోసారి పునరాలోచించాలని మీడియా వేదికగా ఆయన హెచ్చరించారు. వెంకటగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కుండ్లూరు రామకృష్ణ కుమార్తె లక్ష్మీప్రియకు టికెట్ కేటాయించడంతో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మస్తానయ్య అసహనం వ్యక్తం చేశారు. బిసిలకు సీటు ఇవ్వకపోతే టిడిపి గల్లంతు ఖాయమని ఆయన బహిరంగంగా ప్రకటించారు. వలసొచ్చిన వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి సత్యవేడులో టికెట్ ఖరారు చేయడంతో ఆశావాహుడైన జెడి రాజశేఖర్ రెబల్ బెల్ మోగించారు. స్వతంత్రంగానైనా బరిలో దిగేందుకు ప్రచారాన్ని ప్రారంభించారు.

విశాఖ దక్షిణం సీటుపై జనసేనలో రగడ

విశాఖ దక్షిణం సీటుపై జనసేన నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. ఎక్కడి నుంచో తీసుకొచ్చిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను తమ నెత్తి మీద పెట్టడం ఎంతవరకు సమంజసం అంటూ ఒక గ్రూపు వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వంశీకృష్ణకు సీటు వద్దు స్థానికులు ముద్దు అంటూ శ్రీనివాస్ ఫొటోలను దక్షిణ నియోజకవర్గ జనసేన నేతలు మూగి శ్రీనివాస్, కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్ గ్రూపు నాయకులు తగలబెట్టడంతో వివాదం చోటుచేసుకుంది. వంశీకృష్ణ గ్రూపు చెందిన సుమారు 50 మంది వచ్చి తమ నేత ఫొటోలను ఎందుకు తగులబెట్టారంటూ గొడవకు దిగారు. వివాదం పెద్దది కావడంతో పోలీసులు వచ్చి సర్ది చెప్పారు.

పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు టికెటు కేటాయించాలని ఆ పార్టీ నేత నరసరావుపేట మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ టికెట్ జనసేన పార్టీకి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు.

చేబ్రోలులో జంట హత్యలు

- వివాహేతర సంబంధమే కారణం?

ప్రజాశక్తి - పిఠాపురం (కాకినాడ జిల్లా)



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బుధవారం జంటహత్యలు కలకలం రేపాయి. వివాహేతర సంబంధమే ఈ ఘటనకు కారణమని అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చేబ్రోలుకు చెందిన పి లోవమ్మ (35) భర్తతో విభేదాల వల్ల విడిపోయి వ్యవసాయ కార్మికురాలిగా ఉంటూ పిల్లలను పోషించుకుంటున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వివాహితుడు ఎల్ నాగబాబుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇటీవల కాలంలో స్థానిక రైతు పి శ్రీను (45)తోనూ ఆమె పరిచయం పెంచుకున్నారు. ఈ విషయంలో నాగబాబు, లోవమ్మల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం చేబ్రోలు శివారు లక్ష్మీపురంలో ఉన్న శ్రీను పొలంలో పనికి లోవమ్మ వెళ్లారు. విషయం తెలుసుకున్న నాగబాబు లక్ష్మీపురం వచ్చి పొలంలో ఉన్న లోవమ్మ, శ్రీనులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యాడు. ఈ దాడిలో శ్రీను, లోవమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని డిఎస్‌పి హనుమంతరావు, సిఐ శ్రీనివాస్ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్


తారకేశ్వరరావు

చదువులో రాణించలేక మనస్తాపంతో బిటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పార్వతీపురంలోని 29వ వార్డు కుసుమగుడి వీధికి చెందిన కల్లూరి శంకరరావు, ఢిల్లీశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు తారకేశ్వరరావు (18) విజయనగరంలోని సెంచూరియన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాలేజీలో ప్రవేశం నాటి నుంచి తనకు ఇంజనీరింగ్ విద్య బోధపడటం లేదని, చాలా కష్టంగా ఉందని తరచూ తల్లిదండ్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తూ ఉండేవారు.

ఈ నేపథ్యంలో చదువులో రాణించలేకపోతున్నానని తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారు. బుధవారం ఉదయం తల్లిదండ్రులు శంకరరావు, ఢిల్లీశ్వరి హోటల్ నిర్వహణ నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో తారకేశ్వరరావు ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల సమాచారంతో పట్టణ ఎస్‌ఐ పి.సంతోషికుమారి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కవిత కావాలి శాంతి బావుటా!



అక్షరాల కూర్పు, అలంకారాల చేర్పు, సౌందర్యాల మెరుపు,
వెరసి కవిత అనగలమా?
ప్రకృతి అందాల మార్పు
ప్రేయసీ ప్రియుల వలపు
వారి చిలిపి మాటల వడుపు
కలిపి కవితను కనగలమా?
భాషలోని పదాల సొబగు
కవితా మాలగా అల్లిన సొగసు
యిస్తుందేమో మనసుకు మై
మరుపు,
ప్రకృతి ఆరాధన, సౌందర్య పిపాస
వ్యక్తి పూజ, కలల అలల పై
నివాసం... ఓ కవీ!సత్య దూరమయిన మెత్తని పరుపుపై
నిద్రిస్తున్నదేమో నీ మనసు,
ఊహాలకే పరిమితమేమో
నీ కవిత ఒక్కమారు ఆలోచించు!
నీవున్న సమాజాన్ని మనసుతో చూడు, ఆకలి చావులను
యుద్ధోన్మాదాన్ని పరిశోధించు
నీ కవిత కావాలి సమాజ
అభ్యుదయానికి పునాది
సమ సమాజ ఆశయ సిద్ధి
కులమతాలకు, వర్గపోరుకు
చితి పేర్చి అక్రమాలకు, అన్యాయా లకు, అబలలపై
అకృత్యాలకు
అణ్వాయు ధమయి, వాటిని కాల్చి
భస్మం చెయ్యాలి
నీ కలమే నీ బలమయిన ఆయుధం
సమాజంలో దుష్ట రక్కసులను చీల్చి చండా డే కరవాలం
నీ కవిత కావాలి శాంతి బావుటా....

డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా
కర్నూలు

(నేడు అంతర్జాతీయ కవితా దినోత్సవం)

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ (తిరుపతి జిల్లా)

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్నారు. తిరుపతి జిల్లాలో బుధవారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... బిఎన్ కండ్రిగ మండలం వెస్ట్ వరత్తూరు గ్రామానికి చెందిన కొండేటి మణి (30)కి రెండు ఎకరాల పొలం ఉంది. మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశారు. పంటకు తెగులు సోకి పూర్తిగా నష్టం వాటిల్లింది. పెట్టుబడి కోసం తెచ్చిన నాలుగు లక్షల రూపాయల అప్పు ఎలా తీర్చాలో తెలియక దిగులుతో పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పక్క పొలాల్లోని రైతులు గమనించి ఆయన భార్య లేఖకు సమాచారం ఇచ్చారు. రైతు కుటుంబాన్ని ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.